ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీ చేసి విత్తనాలతో పాటు పలు రికార్డులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణాలలో కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫెర్టిలైజర్ డీలర్లు కల్తీ విత్తనాలు అమ్ముతున్నారని తెలిస్తే రైతులు తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ తనిఖీలో ఏఓ రాజశేఖర్. ఎస్సై శ్రీనివాస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

నవతెలంగాణ -నంగునూరు

ఈసెట్ ఆన్లైన్ స్లాట్ బుకింగ్ నేటి నుంచి ప్రారంభమవుతుందని రాజగోపాల్ పేట పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు పూర్తి చేసి నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈసెట్లో ర్యాంక్ పొందిన విద్యార్థులు ముందుగా ఆన్లైన్లో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 10 నుంచి 12 వరకు రాజగోపాల్ పేట కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలన్నారు. విద్యార్థులు ర్యాంక్ కార్డు, డిప్లొమా మార్కుల మెమో, ఆధార్ కార్డు, కులం, ఆదాయం, స్టడీ సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలన్నారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం లాగిన్, ఐడీ అంద జేస్తామని, ఆప్షన్లు పెట్టుకున్న వారికి 18న సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

పడకేసిన పల్లె పాలన



- పాలకవర్గంలేదు...15వ ఆర్థిక సంఘం నిధులూ లేవు
- కార్మికులకు జీతాల్లేవు...కరెంట్ బిల్లులకు పైసల్లేవు
- ట్రాక్టర్ల నిర్వహణ, రిపేర్లకు పైసల్లేక షెడ్లకే పరిమితం
- వర్షాలు కురుస్తుండడంతో పెరుగుతున్న చెట్లు, చెదారం
- రోడ్లు గుంతల మయం...లోపిస్తున్న పరిశుభ్రత

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 గ్రామ పంచాయతీలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 647, సిద్దిపేట జిల్లాలో 499, మెదక్ జిల్లాలో 469 పంచాయతీలున్నాయి. సర్పంచ్, వార్డు సభ్యుల పదవి కాలం ఈ ఏడాది ఫిబ్రవరి 1న ముగియడంతో రెండు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక అధికారుల పాలన విధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 12769 పంచాయితీలున్నాయి. ఐదు నెళ్లగా ప్రత్యేక అధికారులే పరిపాలనా వ్యవహారాల్ని చక్కబెడుతూ వస్తున్నారు. పాలక వర్గాలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఊరి అవసరాలు తీర్చడం, పలు అభివృద్ధి పనుల్ని చేపట్టే వారు. తాగునీటి సరఫరా పరిసరాల పరిశుభ్రత, హరితహారం, వైకుంఠదామాలు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, రోడ్లు, డ్రైయినేజీ, వీధి దీపాలు, వైద్య ఆరోగ్యం, విద్యా కార్యాక్రమాలు చేపట్టేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో పాటు స్థానికంగా ఆర్థిక వనరుల్ని సృష్టించుకోవడం, అవసరమైన వస్తువుల్ని ఉద్దెర తెచ్చి పరిష్కరించేది.

> గ్రామ పంచాయతీల పాలక వర్గాల పదవి కాలం ముగిశాక పరిపానల పడకేసింది. ప్రత్యేక అధికారులున్నప్పటికీ ఎన్నికలు, ఇతర విధులు తప్ప ప్రజలకు అందుబాటులో ఉంటున్నదిలేదు. ఉన్నా ఖజానాలో పైసల్లేక ఏ చిన్న పని చేయట్లేదు. 15వ ఆర్థిక సంఘం, ఇతర నిధులేవీ రాకపోవడంతో కార్మికులు, సిబ్బందికి జీతాల్లేవు. కరెంట్ బిల్లులకు పైసల్లేవు. ట్రాక్టర్ల నిర్వహణ, రిపేర్లకు దిక్కులేక షెడ్లకే పరిమితమవుతున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో ఊర్లల్లో చెట్లు, చెదారం పేరుకుపోతది. రోడ్లకు గుంతలు పడుతున్నాయి. తాత్కాలిక రిపేర్లకు పైసల్లేవు. వేసవిలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు మిషన్ భగీరథ నీళ్ల చాలక ట్యాంకర్లు పెట్టి సరఫరా చేశారు. వైకుంఠదామాలు, పల్లె ప్రకృతి వనాలకు నీటి కోసం బోర్లకు మోటర్లు నడిపారు. కరెంట్ బిల్లులు కట్టకపోవడంతో విద్యుత్ శాఖ వడ్డీ భారం మోపుతోంది.

15వ ఆర్థిక సంఘం నిధులురాలే

గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు రావడంలేదు. డిసెంబర్ తర్వాత నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీల్లో పాలనంతా అస్తవ్యవస్థంగా మారింది. మెదక్ జిల్లాకు పంచాయతీల నిర్వహణ కోసం ప్రతి నెల రూ.6.75 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యేవి. గతేడాది డిసెంబర్ నుంచి నిధులు రావడంలేదు. సిద్దిపేట జిల్లాకు రూ.7.25 కోట్లు, సంగారెడ్డి జిల్లాకు రూ.10 కోట్ల వరకు నిధులు వచ్చేవి. నిధులు రాకపోవడం వల్ల పంచాయతీల్లో ఏ ఒక్క పని చేయట్లేదు. పారిశ్రామిక ప్రాంతాల్లో సీఎస్ఆర్ నిధుల్ని స్థానిక పంచాయతీల అవసరాలకు ఉపయోగించేది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉమ్మడి మెదక్ జిల్లాలో సీఎస్ఆర్ ఫండ్స్‌ను జిల్లా స్థాయిలో కేటాయింపులు చేయాలని మంత్రి చెప్పడంతో పరిశ్రమలున్న పంచాయతీలకు కూడా నిధుల్లేకుండా పోయింది.

జీతాల్లేక కార్మికులు పస్తులు

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందికి జీతాల్లేక మూడు నాలుగు నెళ్లు కావస్తుంది. పాలక వర్గాలున్నప్పుడు నిధులు వస్తే కార్మికులకు వేతనాలిస్తుండేది. ప్రస్తుతం బడ్జెట్ రాలేదని చెప్పి వేతనాలివ్వకపోవడంతో కార్మికులు పస్తులుండి పని చేస్తున్నారు. మెదక్ జిల్లాలో 1725 మంది, సిద్దిపేటలో 1800 మంది, సంగారెడ్డి జిల్లాలో 2500 వరకు కార్మికులున్నారు. వీరందరికీ నెలకు రూ.9500 వేతనాలు చెల్లించాలి. బడ్జెట్ రాలదనే నెపంతో కార్మికులకు జీతాలు చెల్లించడంలేదు. రోజంతా పంచాయతీల్లో కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో పంచాయతీలున్నాయి. సబ్బులు, టవల్స్, యూనిఫామ్స్ వంటి సదుపాయాల్లేవు.

కరెంట్ బిల్లులపై వడ్డీ భారం

గ్రామ పంచాయతీల్లో కరెంట్ బిల్లులు పేరుకుపోతున్నాయి. ప్రత్యేక అధికారుల పాలన ఏర్పడిన తర్వాత ఏ పంచాయతీల్లోనూ కరెంట్ బిల్లులు కట్టిందిలేదు. వేసవిలో తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు అదనంగా మోటర్లు వాడారు. మిషన్ భగీరథ ట్యాంకర్ల నీళ్లు చాలకపోవడంతో అదనపు ట్యాంకర్లకు నీళ్లు పట్టేందుకు మోటర్ల నడిపారు. వైకుంఠదామాలు, పల్లె ప్రకృతి వనాలకు నీటి కోసం మోటర్లు నడుస్తున్నాయి. వీధి దీపాలు, గ్రామ పంచాయతీ అవసరాలకు వాడిన కరెంట్ బిల్లుల్ని చెల్లించేందుకు డబ్బుల్లేవు. పెండింగ్ బిల్లులపై విద్యుత్ శాఖ వడ్డీ భారం వేస్తోంది. బిల్లులు కట్టకపోతే కరెంట్ కట్ చేస్తమంటూ బెదిరిస్తున్నారు.

పంచాయతీల నిర్వహణ... తాత్కాలిక మరమ్మతులకూ పైసల్లేవు

గ్రామ పంచాయతీల్లో వీధి దీపాలు చెడిపోతే కొత్తవి సమకూర్చేందుకు పైసలు కావాలి. కరెంట్ మోటర్ల రిపేర్లు వస్తున్నాయి. వైరింగ్, లైట్లు, ఇతర వస్తువుల్ని సర్పంచ్‌లు ఉద్దెర తెచ్చి బడ్జెట్ వచ్చాక చెల్లించేది. ప్రత్యేక అధికారులు అప్పు చేసేందుకు సిద్దపడట్లేదు. నీటి సరఫరాలో పైపుల లీకేజీలు, ట్యాంకర్లు, నల్లాల మరమ్మతులు వస్తున్నాయి. వేసవిలో ట్యాంకర్లలో నీటిని సరఫరా చేయడం, అద్దె బోర్లు నడిపినందుకు చెల్లించే అద్దెలకు కూడా డబ్బుల్లేని పరిస్థితి ఉంది. వర్షాలు పడుతున్నందున ఊర్లల్లో పరిసరాలు పాడవుతాయి. బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందుల్ని కొనేందుకు పైసల్లేవు. ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీ, ట్యాంకర్ రిపేర్లు, డిజీల్, డ్రైవర్ ఖర్చులకు పైసల్లేక రిపేర్ వస్తే అవి షెడ్‌లోనే మగ్గుతున్నాయి. రోడ్లు, వీదుల్లో గుంటల్ని పూడ్చడం, మట్టి కొట్టడం, చెట్లు నరకడం వంటి పనులకు పైసల్లేక ఇబ్బందిగా మారిందని పలువురు అధికారులు వాపోతున్నారు.

నందారం హెడ్మాస్టర్‌కు షోకాజ్ నోటీసులు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం నందారం గ్రామంలో బడిబాట నిర్వహించని హెడ్మాస్టర్ నిర్మలకు మండల ఎంఈఓ షోకాస్ నోటీసులు జారీ చేశారు. 'నవతెలంగాణ పత్రికలో గురువారం బడికి దూరమైన హెడ్మాస్టర్ కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఎంఈఓ ఉదయ్ భాస్కర్ ఈ రెడ్డి శుక్రవారం షోకాజ్ నోటీసులను జారీ చేశారు. అట్టి నోటీసులను మండల నోడల్ ఆఫీసర్ నందారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలకు అందించారు. బడిబాటకు దూరం అవడానికి కారణాలు ఏంటో మూడు రోజుల్లో తెలపాలని, లేదంటే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని ఆ షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

పిడుగు పాటుకు వ్యక్తి మృతి



నవతెలంగాణ-చిలిపిచెడ్

మండల పరిధిలోని చిట్కూల్ గ్రామంలో పిడుగుపాటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం చిట్కుల్ గ్రామానికి చెందిన బోయిని నర్సమ్మ (52) భర్తతో కలిసి వ్యవసాయ పొలాలకు వెళ్లి తిరిగి వస్తుండగా సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గ్రామ శివారులోని పంట పొలాల్లో పిడుగు పడి బోయిన నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని గ్రామస్తులు కోరారు .

చెరువులో పడి వృద్ధుడి మృతి



నవ తెలంగాణ-దుబ్బాక

కాలకృత్యాల కోసం వెళ్లిన ఓ వృద్ధుడు చెరువులో పడి మృతి చెందిన ఘటన దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట 10వ వార్డులో గురువారం జరిగింది. దుబ్బాక ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే వార్డుకు చెందిన చెట్ల నర్సయ్య (75) గురువారం మధ్యాహ్నం తన ఇంటికి సమీపంలోని లచ్చపేట పెద్ద చెరువులో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి చెరువు తూములో జారీ పడ్డాడు. వరుసకు మనమడైన కొత్తపల్లి యశ్వంత్ కుటుంటీకులకు సమాచారం అందించాడు. కొన ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న నర్సయ్యను దుబ్బాకలోని ప్రభుత్వ ఆసుపత్రికిర, అక్కడి నుంచి సిద్దిపేటలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించాడు. మృతుడి కుమారుడు చెట్ల మునేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు 7 పతకాలు



నవతెలంగాణ-సిద్దిపేట

హనుమకొండలో 6,7 తేదీలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట జిల్లాకు రెండు బంగారు పతాకాలు, ఒక వెండి పతకం, మూడు కాంస్య పతకలు సాధించారని సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కరోళ్ల వెంకట స్వామి గౌడ్ తెలిపారు. శుక్రవారం అయన మాట్లాడుతూ మహిళల విభాగంలో ఇంద్రాణి హై జంప్ విభాగంలో బంగారు పతకం, పురుషుల విభాగంలో శ్రీకాంత్ జవలియన్ త్రో లో బంగారు పతకం, గ్యారలీల ఆనంద డేకాత్లాన్‌లో వెండి పతకం, ఇదే విభాగంలో సంతోష్ కాంస్య పతకం, అండర్ 10 బాలుర విభాగంలో గాడిచర్ల జితేష్ పరుగులో కాంస్య పతకం, గణేష్ 20 కేఎం వాకింగ్ కాంస్య పతకం, అభిషేక్ పదివేల మీటర్ల పరుగులో వెండి పతకం సాధించారని తెలిపారు. క్రీడాకారులను, శిక్షకులు కృష్ణ కుమార్, నిశంక్ గౌడ్‌లను సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పన్యల రామేశ్వర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా సైకిల్ అసోసియేషన్ అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు, టీజీపేటా జిల్లా అధ్యక్షులు ఏర్వా అశోక్, జిల్లా రెజ్లింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య, జిల్లా వాలీబాల్ సంఘం ప్రధాన కార్యదర్శి కామిరెడ్డి రవీందర్ రెడ్డి, జిల్లా ప్రవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా అధ్యక్షులు బయ్యారపు కనక రెడ్డి తదితరులు అభినందించారు.

నేడు పాలమకుల సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం పాలమకుల 132 కేవీ సబ్ స్టేషన్‌లో శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని సిద్దిపేట టౌన్ ఏడీఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. పాలమాకుల 132 కేవీ సబ్ స్టేషన్ లో మెయింటెనెన్స్ పనులు ఉన్నందున మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయం ఏర్పడినందున మండల ప్రజలు, రైతులు, వాణిజ్య వ్యాపార సంస్థలు సహకరించాలని కోరారు.

ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలి

- సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం
- మందుల కొరత లేకుండా చూడాలి
- అన్ని రకాల పరీక్షలు ప్రభుత్వ దవాఖానాలో చేయాలి
- సొంత ఖర్చులతో అంబులెన్స్ ఏర్పాటు
- వైద్యాధికారుల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే రోహిత్



నవతెలంగాణ-మెదక్

జబ్బు బారిన పడిన ప్రతి ఒక్కరికీ మెరుగైన ఉచిత వైద్యం అందజేయాలని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాధికారులతో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనపల్లి రోహిత్ మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు కట్టడి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో జబ్బు పడ్డ ప్రతి వ్యక్తికి ఉచితంగా వైద్యం అందాలన్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి సీజనల్ వ్యాధులు పొంచి ఉండే ప్రమాదం ఉన్నందున అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరీక్షలు జరిపించాలన్నారు.

తన సొంత నిధులతో జిల్లా ఆసుపత్రికి అంబులెన్స్ కేటాయిస్తానని అలాగే ప్రభుత్వం నుంచి వచ్చే అంబులెన్స్ త్వరలో ఇప్పిస్తానని తెలిపారు. మందులు అందుబాటులో ఉండాలని, అన్ని రకాల పరీక్షలు ప్రభుత్వ హాస్పిటల్‌లో నిర్వహించాలన్నారు. ప్రతి ప్రభుత్వ హాస్పిటల్లో తాగునీటి వసతిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు వానకాలంలో వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరం లక్షణాలు లాంటివి కనబడితే ఆందోళనకు గురికాకుండా ప్రభుత్వ హాస్పిటల్‌లో వైద్యం చేసుకోవాలన్నారు.

వ్యక్తిగత పరిసరాల శుభ్రత పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని తెలిపారు. ప్రజల్లో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య కేంద్రాలను పూర్తి చేయాలన్నారు. మండలాల వారీగా వైద్యాధికారులతో ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వానకాలం వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అల్పాహారం వేడి చేసిన భోజనం తీసుకోవాలన్నారు. నిలువ చేసిన పదార్థాలు, బయట తినుబండాలకు దూరంగా ఉండి ప్రజలు ఆరోగ్యాన్ని రక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలను పకడ్బందిగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ మను చౌదరి

నవ తెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్





గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవకతవకులు జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సమీకృత సముదాయం సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్, గ్రూప్ 2 ఫిలిమ్స్ ఎగ్జామ్స్ జిల్లా నోడల్ అధికారి గరిమ అగ్రవాల్ ఆధ్వర్యంలో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షల నిర్వహణ పై రూట్ అధికారులు, డిపార్మెంటల్ అధికారులు, ఐడెంటిఫికేషన్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులనుద్దేశించి మాట్లాడుతూ టీజీపీఎస్సీ గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష 9వ తేదీన ఆదివారం ఉన్నందున శనివారం ఉదయంలోగా జిల్లాలో గల 21 పరీక్ష కేంద్రాలలో అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. డిపార్మెంట్ అధికారులు అన్ని పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు, పరీక్ష కేంద్రంలో రక్షణ ఏర్పాట్లు, విద్యుత్తు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, త్రాగునీరు తదితర ఏర్పాట్లను పరిశీలించి పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటిండెంట్‌లకు తగు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. రూట్ ఆఫీసర్లు ఇప్పటికే పరీక్ష పత్రాలను పరీక్ష కేంద్రాలకు చేరవేయడంపై మాక్ డ్రిల్ చేసినందున పరీక్ష రోజు ఉదయం 5:30 గంటలకే పరీక్ష మెటీరియల్ ఉన్న స్ట్రాంగ్ రూముకు వెళ్లి పరీక్ష సామాగ్రిని పైలట్, ఎస్కార్ట్ వాహనాలతో గట్టి పోలీస్ బందోబస్తుతో వెళ్లి పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటిండెంట్‌కు అందించాలన్నారు. పరీక్ష అనంతరం మళ్లీ ఎస్కార్ట్ వాహనంతో స్ట్రాంగ్ రూమ్‌కు పరీక్ష మెటీరియల్ ను చేరవేయాలన్నారు. ఐడెంటిఫికేషన్ అధికారులు పరీక్ష కేంద్రాల్లోకి వచ్చే అభ్యర్థుల హాల్ టికెట్‌ను అలాగే ఇతర గుర్తింపు కార్డులను పరిశీలించి లోపలికి పంపాలన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు మెయిన్ గేట్ వద్ద, పరీక్ష హాల్ వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించాలన్నారు. పురుష, మహిళా అభ్యర్థులను వేర్వేరుగా పురుష, మహిళా సిబ్బంది తనిఖీ చేయాలన్నారు. బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు ఉదయం 9:30 గంటల నుంచి పరీక్ష రాసే అభ్యర్థుల వేలిముద్రను బయోమెట్రిక్ ద్వారా రికార్డు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 8223 మంది పరీక్ష రాయనుండగా వారిలో 13 మంది అంధ దివ్యాంగ అభ్యర్థులు ఉన్నారని వారికి ఇంటర్మీడియట్ వరకు మాత్రమే చదివిన వారిని సహాయకులుగా నియమించి పరీక్ష రాయించాలన్నారు. పరీక్ష సమయం పూర్తయ్యేలోగా పరీక్ష కేంద్రం నుంచి ఎవరు బయటకు వెళ్లడానికి వీలులేదన్నారు. పరీక్ష హాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదన్నారు. అభ్యర్థులు పరీక్ష రోజు పరీక్ష కేంద్రాలను గుర్తించడానికి హడావిడి పడతారని వీలైతే ఒకరోజు ముందుగానే పరీక్ష కేంద్రాలను చూసుకోవాలని పరీక్ష రాసే అభ్యర్థులకు సూచించారు.

నిబంధనల ప్రకారం గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు





నవతెలంగాణ-మెదక్

జూన్ 9న జరుగనున్న గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్షను నిబంధనల ప్రకారం పక్కగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రూప్ 1 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. స్ట్రాంగ్ రూం నుండి పరీక్షా కేంద్రానికి ప్రశ్నా పత్రాలు, తిరిగి పరీక్షా కేంద్రం నుండి జవాబు పత్రాలు రిసెప్షన్ సెంటర్ కు తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలీస్ బందోబస్తుతో తీసుకొని వెళ్లి పరీక్షా కేంద్రాల్లోని లైజనింగ్ అధికారులకు అందజేయాలని, రిసెప్షన్ సెంటర్ లో టిజిఎస్పిఎస్సి అధికారులకు అందజేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రం పరిసరాలు 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రం సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను పూర్తిస్థాయిలో మూసివేయాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షల కేంద్రానికి సమయానికి చేరుకోవాలని, పరీక్ష కేంద్రంలోకి ఫోన్ అనుమతి లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 3,926 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మశ్రీ, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రతినిధి రోహిత్, జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ వంశీకృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సంగారెడ్డి
2
శనివారం | 08 జూన్ 2024 | www.navatelangana.com

యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా కిరణ్ గౌడ్

నవతెలంగాణ-న్యాల్‌కల్

యూత్ కాంగ్రెస్ న్యాల్కల్ మండలాధ్యక్షుడిగా డప్పూర్ కిరణ్ గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కిరణ్‌గౌడ్ మాట్లాడు తూ.. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి పార్టీ కార్యక్ర మాల్లో చురుగ్గా పాల్గొంటానన్నారు. మండలాధ్యక్షుడిగా తనను నియ మించి నందుకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గీతారెడ్డి, ఫిలిం డెవలప్మెంట్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, పార్టీ రాష్ట్ర నాయకులు ఉజ్వల రెడ్డి , మండల నాయకులు శ్రీనివాస్ రెడ్డి , భాస్కర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



'మహిమ మినిస్ట్రీస్ హెూం ఫర్ బాయ్స్'లో ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని 'మహిమ మినిస్ట్రీస్ హెూం ఫర్ బాయ్స్'ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. రమేష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిస రాలు, పిల్లల వసతి గది, వంటగది, బాత్రూమ్స్, టాయిలెట్స్ ఏ విధంగా ఉన్నాయని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని కోరారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని పిల్లలను మంచిగా చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెూం నిర్వాహకుడు బాగయ్య, పిల్లలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





'ఉపాధి' రక్షణకు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సిములు

నవతెలంగాణ-సంగారెడ్డి

ఉపాధి హామీ రక్షణ కోసం జూన్10న సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వ్యసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సిములు పిలుపుని చ్చారు. ఈ మేరకు సంగారెడ్డి మండలంలోని ఇరిగిపల్లి, కలబ్‌గురు,అంగడిపేట్ గ్రామాల్లో రాష్ట్ర సదస్సు కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సంద ర్భంగా నర్సిములు మాట్లాడుతూ.. ఉపాధి హామీ రక్షణ కోసం జరిగే రాష్ట్ర సదస్సులో ముఖ్య అతిథులుగా గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు (ఎంపీ) శివదాసన్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్. వెంకటరములు హాజరవుతారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘాల పోరాట ఫలితంగా పార్లమెంటులో యూపీఏ-1 ప్రభుత్వానికి వామపక్షాల మద్దతు ఇవ్వడం ద్వారా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 100 రోజుల పని గ్యారెంటీ చేస్తూ చట్టం చేయడం జరిగిందన్నారు. దీనిని తెచ్చిన ఘనత వామపక్షాలది, వ్యవసాయ కార్మిక సంఘాలదన్నారు. రాష్ట్రంలో 54 లక్షల జాబ్ కార్డుల్లో కోటి 20 లక్షల హామీని పటిష్టంగా అమలు చేయడం కోసం పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. సంగారెడ్డి జిల్లాలో రెండున్నర లక్షల జాబు కార్డుల లో 4.50 లక్షల మంది కూలీలు పేర్లు నమోదు చేసుకున్నారని, డిమాండ్‌కు అను గుణంగా కూలీలందరికి పనికల్పించడం లేదన్నారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని, ఉపాధి పని చేస్తున్న కూలీలకు కనీసం రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రమకు తగ్గ ఫలితం రావడం లేదని, ఫీల్డ్ అసిస్టెంట్లను రెగ్యులరై జేషన్ చేయాలని కోరారు. మండుటెండలో పనిచేసిన రోజు కూలి రూ.180 లోపు పడుతుందని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు, మంచినీరు మొదలగు సౌకర్యాలు అందుబాటులో లేవన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సరి అయిన వేతనాలు రాకపోవడం దారుణమ న్నారు. ఉపాధి పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీరు సౌకర్యాలు ఉండాలని చట్టంలో చెబు తున్నా.. అవి అమలు జరగకపోవడం అన్యాయమన్నారు. ఉపాధి హామీ పని ది నాలను 200 రోజులకు పెంచాలని, కొలతలతో సంబంధం లేకుండా రోజు కూలి రూ.600 ఇవ్వాలని, ప్రతి కూలీకి పనిముట్లు పలుగు, పారా పదునుకు ప్రత్యేక నిధి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ రాష్ట్ర సదస్సుకు ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఈజీఎస్ సిబ్బంది మెట్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్, మనెయ్య, జగదంబ, చంద్రయ్య, శివ్వయ్య, అంజయ్య, లక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.



చినుకు పడితే చిత్తడే..

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని మెటల్ కుంట, కల్‌బెమాల్, రేజింతల్ సిద్ధి వినాయక ఆలయ గ్రామీణ రోడ్లు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. దాంతో ప్రయాణీకులు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్లపై ఉన్న భారీ గుంతల్లో నీరు నిలవడంతో.. ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉన్నదని వారు వాపోతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఈ రోడ్ల పరిస్థితి మారడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. ఈ రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.



బడి బయట పిల్లలను గుర్తించండి

నవతెలంగాణ-న్యాల్‌కల్

'బడి బయటి పిల్లలను' గుర్తించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచుకోవాలని మండలంలోని ఆయా పాఠశాలలల్లో ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మెన్, సెక్రెటరీలతో కలిసి హెచ్‌ఎంలు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 6 నుండి 11 తేదీ వరకు బడిబాట కార్యక్రమం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా చొరవచూపాలని వారికి సూచించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి.. ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించి బడిలో చేర్పించాలన్నారరు. ఈ సమావేశాల్లో హెచ్‌ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు కృష్ణ కుమార్, సెక్రెటరీ గాయత్రి, ఎస్‌ఎంసి చైర్మన్‌లు తదితరులు ఉన్నారు.

చెరువులో పడి వివాహిత గల్లంతు

నవతెలంగాణ-అమీన్‌పూర్



అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చెరువులో పడి గల్లంతై మృతదేహం లభ్యమైన ఘటన అమీన్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్పూర్ మున్సి పాల్టీ పరిధిలోని సాయిధామం అపార్ట్మెంట్లో రవితేజ, జయశ్రీ (25) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి నాలుగు సంవత్సరాల పాప ఉంది. అయితే మనస్పర్థల వల్ల గత మూడేళ్ల క్రితం విడాకులకు ఇద్దరూ న్యాయ స్థానానికి అర్జీ పెట్టుకున్నారు. అయితే పది రోజుల క్రితంరవితేజ తండ్రి చనిపో వడంతో జయశ్రీ కూడా మామ అంతిమ సంస్కారాల కు హాజరైనట్లు తెలుస్తోంది. కాగా గురువారం అమీన్పూర్ పెద్ద చెరువు సందర్శనకు వెళ్లిన జయశ్రీ.. చెరువులో విగతజీవిగా తేలింది. ప్రమాదవశాత్తు చెరువులో జారిపడిందా, లేక కావాలని హత్య చేశారా అనే కోణంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. కాగా చెరువులో జయశ్రీ మృతదేహం కోసం పోలీస్ సిబ్బంది గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్చెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు భర్త రవితేజ ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేపట్టారు.

రేపే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

- కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు పూర్తి
- జిల్లా ఎస్పీ రూపేష్
- జిల్లా వ్యాప్తంగా 16 సెంటర్లలో పరీక్ష రాయనున్న 9672 మంది అభ్యర్థులు

పరీక్షా కేంద్రాల వివరాలు..

గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ (గీతం కాలేజ్ రుద్రారం-2), ఎంఎన్‌ఆర్-మెడికల్ కాలేజ్-2, సెయింట్ ఆంథోనీ జూనియర్ కాలేజ్ శాంతినగర్-1, సెయింట్ ఆంథోనీ హై స్కూల్ శాంతినగర్ -1, పాలిటెక్నిక్ కాలేజ్ శివంపేట -1, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ (టీఎన్జీవో భవన్ బ్యాక్ సైడ్)-1, తార కాలేజ్ -1, కరుణ స్కూల్ -1, ఎస్ వి జూనియర్ కాలేజ్ -1, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజ్-2, ఎల్లంకి ఇంజనీరింగ్ కాలేజ్ కృష్ణారెడ్డిపేట్ -1, రత్నపురి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ (హత్నూర)-1, కారామెల్ స్కూల్ (చింతల్ చెర్వు)-1.



నవతెలంగాణ-సంగారెడ్డి

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష రేపు(ఆదివారం) జరగను న్నది. ఈ పరీక్ష శాంతియుత వాతావరణంలో జరిగేటట్టు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పోలీసు శాఖ తరఫున అన్నిరకాల భద్రత పరమైన ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 16 సెంటర్లు ఉండగా.. మొత్తం 9,672 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నార న్నారు. పరీక్షకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, పట్టణ ప్రధాన రోడ్డు లు, చౌరాస్తాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేశామ న్నారు. అత్యవసర సేవలకు గాను ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద మెడికల్ సిబ్బంది ఉంటారని, రెండు, మూడు సెంటర్లకు ఒక అంబులెన్స్ అందుబాటులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుదని, ఎవ్వరూ



కూడా పరీక్ష కేంద్రం పరిసరాల్లో తిరగ టానికి వీల్లేదన్నారు. ఎగ్జామ్స్ సెంటర్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి జిరాక్స్ షా పులు తెరిచి ఉంచొద్దని.. షాపు యజ మానులకు సూచనలు చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులకు అసౌకర్యం కలుగకుం డా ఆర్టీసీ డిపార్ట్మెంట్ వారు ప్రతీ సెంటర్ కు స్పెషల్ బస్సులు నడుపుతున్నారన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకు ంటారని.. అభ్యర్థులు బయోమెట్రిక్, వెరీఫికేషన్ సిబ్బందికి సహకరించాలన్నారు.

అభ్యర్థులకు సూచనలు:

పరీక్ష రోజున ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను ఎగ్జామ్ హాల్ లోనికి అనుమతి ఇస్తారు. 10 గంటలకు ఎగ్జామ్ సెంటర్ గేట్ మూసివేస్తారని.. 10 గంటల తర్వాత ఒక సెకండ్ ఆలస్యంగా వచ్చిన ఎవ్వరిని లోపలికి అనుమతించబోరన్నారు. ఎగ్జామ్‌కు వచ్చిన అభ్యర్థులు హాల్ టికెట్ పైన ఉన్న నిబంధనాలు తప్పకుండా పాటించాల న్నారు. హాల్ టికెట్‌తో పాటు ఒక కలర్ ఫోటో, ఒరిజినల్ ఆధార్ కార్డు/ డ్రైవింగ్ లైసెన్స్/ఉద్యోగి గుర్తింపు కార్డ్/ఓటర్ గుర్తింపు కార్డ్ ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. హాల్‌టికెట్‌లో ఫోటో సరిగ్గా కనిపించకపోతే 3-కలర్ ఫోటోలు తీసుకొని, హాల్ టికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించు కోవాలని చెప్పారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ముందస్తుగా చూసుకున్నట్లైతే, పరీక్ష రోజు పరీక్ష కేంద్రానికి సులువుగా చేరుకోవచ్చు అన్నారు. ఎగ్జామ్ రాయడానికి (బబ్లింగ్) బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్ను మాత్రమే అనుమతిస్తారన్నారు. ఎగ్జామ్స్ హాల్ లో నికి మొబైల్ ఫోన్స్, స్మార్ట్ వాచ్, కాలిక్యులేటర్స్, వైట్ పేపర్స్, పెన్ డ్రైవ్స్, టాబ్లెట్స్, షూస్, హియరింగ్ సొల్యూషన్స్ సంబంధించిన గాడ్జెట్స్ అనుమతించడం జరగదన్నారు. ఎగ్జామ్ పూర్తి అయిన తర్వాత ఒంటిగంట వరకు ఎవ్వరిని బయటకు పంపడం జరగదని, అభ్యర్థులు ఎగ్జామ్ రాసిన తర్వాత ప్రశ్నాపత్రం తమతో పాటు తీసుకు వెళ్ళడానికి వీలుగా ఉంటుందన్నారు. అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్, మాస్ కాపింగ్ చేసినట్లు తేలితే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయన్నారు.

మంచినీటి కనెక్షన్ల కోసం ఇంటింటి సర్వే పకడ్బందీగా చేయాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్.. ఇంటింటి సర్వేపై సమీక్ష సమావేశం



నవతెలంగాణ-సంగారెడ్డి

మిషన్ భగీరథ మంచినీటి కనెక్షన్లపై ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం నిర్వహించిన వీడియో సమావేశం ద్వారా ఇచ్చిన ఆదేశాలు మేరకు, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచనల మేరకు, మిషన్ భగీరథ మంచినీటి కనెక్షన్ల ఇంటింటి సర్వే కార్యక్రమంపై పటాన్చెరు, సంగారెడ్డి,అందోల్ నియోజ కవర్గం పనిచేసే ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రెటరీ లు అధికారులతో కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ శిక్షణ కార్యక్రమాన్ని శు క్రవారం నిర్వహించారు. మిషన్ భగీరథ కనెక్షన్లు ఏర్పాటు చేసిన తర్వాత కుటుంబ సభ్యులు పెరగడంతో, తాగునీటి అవసరాలు అనుగుణంగా ఏర్పాటు కోసం పది రోజులపాటు సర్వే నిర్వహించాలన్నారు. మంచి నీటి కనెక్షన్లు కుటుంబ సభ్యుల వివరాలు, నీటి అవసరాలు ఆర్డబ్ల్యూఎస్ శాఖ అభి వృద్ధి చేసిన ప్రత్యేక యాప్ లో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో 400 కన్నా తక్కువ కనెక్షన్లు ఉన్న పంచాయతీల్లో పంచాయతీ సెక్రటరీలు సర్వే చేయాలన్నారు. 400 కన్నా ఎక్కువ కనెక్షన్లు ఉంటే, పంచాయతీ సెక్రెటరీ తో పాటు, అంగన్వాడి టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల తో సర్వే నిర్వహించా లన్నారు. పెరిగిన కుటుంబాలకు అనుగుణంగా కావలసిన నీటి అవసరాలు గుర్తించాలన్నారు. ఆర్డబ్ల్యూఎస్ ఆధ్వర్య ంలో తయారుచేసిన ప్రత్యేక యాప్ పనితీరుపై జిల్లా నుండి నలుగురు అధికారులకు శిక్షణ ఇవ్వడం జరిగింది అన్నారు. సర్వే విధానం గురించి అధికారులు వివరించారు. ఈనెల 10వ తేదీన జహీరాబాద్ నారాయణఖేడ్ సెక్రటరీలకు ఆర్డబ్ల్యూఎస్ యాప్ పని విధానంపై శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సాయి బాబా, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ పాషా, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

బీజేపీ మతతత్వ పార్టీ.. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ

- ఎంపీ సురేష్ సెట్కార్.. నారాయణఖేడ్‌లో ఘనంగా విజయోత్సవ ర్యాలీ



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

'బీజేపీ మతత్వం పార్టీ అని.. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ' అని ఎంపీ సురేష్ సెట్కార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో నారాయణఖేడ్ పట్టణంలోని మహా ఫంక్షన్ హాల్ నుంచి సాయిబాబా ఫంక్షన్ హాల్ వరకు విజయోత్సవ ర్యాలీ ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్, నగేష్ సెట్కార్, గిరిజ సెట్కార్, రాకేష్ సెట్కార్, సాగర్ సెట్కర్ పాల్గొన్నారు. ముందుగా వారిని కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ షట్కర్ మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థి బీ.బీ పాటిల్‌ను చిత్తు చిత్తుగా ఓడించిన ప్రజలకు, కాంగ్రెస్ కార్య కర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ అందరి కుటుంబమని.. ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి మీ కుటుంబంలో మనిషిలా ఉంటానన్నారు. బీజేపీ మతం పేరుతో రాజకీయాలు చేస్తున్నదని దుయ్యబట్టారు. కుల మతాలకతీతంగా కాంగ్రెస్ పార్టీ సంక్షేమ ఫలాలను అంది స్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాహిర్ అలీ, రాష్ట్ర జేఏసీ చైర్మెన్ కర్ర రవికుమార్, జిల్లా నాయకులు ప్రకాష్ రాథోడ్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటాం

- వోక్సన్ యూనివర్సిటీ నుంచి ప్రకటన విడుదల
- యాజమాన్యంతో అఖిలపక్షం చర్చలు
- రూ.22.50 లక్షలు ఇవ్వడానికి అంగీకారం

నవతెలంగాణ-మునిపల్లి

వొక్సన్ యూనివర్సిటీలో తోటమాలి పనికి వెళ్లిన దోసాడ శ్రీనివాస్ అదృశ్యమై చివరికి అకాల మరణం పొందిన విషయం విధితమే. అయితే మృతుడి శ్రీనివాస్ కుటుంబాన్ని అన్ని రకాల ఆదుకుంటామని, భాధిత కుటుం బానికి అండగా నిలుస్తామని వోక్సన్ యూనివర్సిటీ శు క్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉపాధి కోసం వచ్చి.. అకాల మరణం పొందడం మొత్తం వొక్సన్ యూనివ ర్సిటీ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ప్రకట నలో యూనివర్సిటీ పేర్కొంది. శ్రీనివాస్ మృతదేహం లభిం చడంతో.. అఖిలపక్షం నాయకులు కంకోల్, సైదాపూర్ గ్రామస్తులు శుక్రవారం పెద్ద ఎత్తున యూనివర్సిటీ ఎదుట ఆందోళన చేపట్టారు. దాంతో యాజమాన్యం అఖిలపక్షం నాయకులతో చర్చలు జరిపి..మృతుడి కుటుంబానికి రూ.22.50 లక్షలు ఇవ్వడానికి అంగీకరించింది. ఈ నేప థ్యంలోనే యాజమాన్యం రాతపూర్వకంగా అంగీకరంచి.. ప్రకటన కూడా విడుదల చేసింది. అంతేకాకుండా మొత్తం యూనివర్సిటీ సమాజాన్ని ప్రభావితం చేసి, విషాదాన్ని మిగిల్చిన శ్రీనివాస్ మరణం వెనుక ఉన్న నిజాన్ని రాబట డంలో పోలీసు యంత్రాంగానికి తాము పూర్తిగా సహకరి స్తామని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ ఘటనలో బాధిత కుటుంబానికి సత్వర న్యాయం చేకూర్చేందుకు కృషిచ ేసి, సహాయ సహకారాలు అందించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపి ంది. ఆయన ప్రయత్నానికి యూనివర్సిటి ఎల్లవేళలా మద్దతు నిస్తుందని వోక్సేన్ యూనివర్సిటీ పేర్కొంది. యాజమాన్యంతో జరిగిన చర్చల్లో అఖిలపక్ష నాయకులు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్, మునిపల్లి మండల నాయకులు రమేష్ గౌడ్, మండల నాయకులు శ్రీశైలం, వీరన్నపాటేల్, చాంద్ పాషా, ఆసాద్ పాటేల్, సైదాపూర్ గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు మల్లగౌడౌ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి చేతుల మీదుగా పరిహారం అందజేత..

మృతుని అంత్యక్రియల నిమిత్తం ముందుగా రూ. లక్షను యూనివర్సిటీ అందజేసింది. అయితే పరిహా రంగా మరో రూ.22 లక్షల 50 వేలను నేడు(శనివారం) రాష్ట్ర వైద్య శాఖ మంత్రి స్థానిక శాసనసభ్యులు దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా అందించే యోచనలో యాజమాన్యం ఉన్నట్టు తెలిసింది.



చింతల్‌ఘట్ గుండం చెరువును కబ్జా నుంచి కాపాడాలి



నవతెలంగాణ-జహీరాబాద్

అధికారుల నిర్లక్ష్యంతోనే చింతల్‌ఘట్ గుండం చెరువు కబ్జాకు గురైందని.. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరు వును కబ్జా నుంచి కాపాడాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం అన్నారు. కోహిర్ మండలంలోని చింత ల్‌ఘట్ గ్రామంలో సర్వే నెం.113, 114లో గల గుండం చెరువు కబ్జాకు గురైందని ఆరోపించారు. రెవెన్యూ/ ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చెరువు కబ్జాకు గురవు తున్నదన్నారు. ఇరు శాఖల సమన్వయ లోపం వల్ల జాయి ంట్ సర్వే జరిగినట్లు కనిపించలేదన్నారు. చెరువును పూర్తిగా పరిశీలిస్తే.. చెరువు కింద గల 6 ఎకరాల పై చిలుకు భూమి మొత్తం కబ్జాకు గురి అయినట్లు తెలుస్తున్నదన్నారు. ఏడాది క్రితమే భూమి కబ్జాకు గురి అయిందని.. మిగతాది మొన్న అక్రమ కబ్జాకు గురైనట్టు ఆరోపించారు. ఏడాది క్రితమే అధికారులు స్పందిస్తే ఈ తప్పు జరిగేది కాదన్నారు. నియో జకవర్గంలో మొత్తం 123 చెరువులు ఉండగా.. సుమారు 20,000 పైచిలుకు ఏకరాలు సాగుకావాల్సి ఉన్నదన్నారు. కానీ ఒక్క ఎకరా కూడ సాగు కావడం లేదన్నారు. నిబం ధనల ప్రకారం వరద / సాగునీటికి సంబంధించి మొత్తం ఇరిగేషన్ శాఖ కిందనే ఉంటాయని.. వారి అనుమతులు లేనిదే నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం గాని మరలించడం గాని చేయొద్దన్నారు. కానీ నియోజకవర్గంలో అలాంటి కబ్జా లు చాలా జరిగాయని అందుకు జహీరాబాద్ పట్టణంలో దోబీఘాట్, హౌసింగ్ బోర్డ్ నుంచి వెళ్లే నీటి కాలువ, హుగ్గెల్లి గ్రామంలో వరద కాలువ, అల్గోల్ గ్రామంలో 5 చెక్ డ్యాంలు కులగొట్టి ఉసిక వాగు ప్రవాహాన్ని మరలించి వాగు యొక్క విస్తీర్ణాన్ని కుదించడం, పర్శపల్లిలోని తైదుల చెరువు, ఆనె కుంట గ్రామంలో వరద నీటి కాలువ కబ్జాకు గురి కావ డమే నిదర్శనాలు అన్నారు. వాటిపై గతంలోనే సీఈ, ఎస్ ఈలకు పిర్యాదు చేయగా..చర్యలు తీసుకుంటామని చెప్పి నా.. నేటికీ తీసుకోలేదన్నారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మె న్‌గా ఉన్నప్పుడు జెడ్పీ సమావేశంలో వీటిని ప్రస్తావించి చర్య లు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించి నట్టు గుర్తు చేశారు. అప్పుడే అధికారులు సరైన చర్యలు తీసుకుని ఉంటే.. నేడు ఈ దుస్థితి ఏర్పడేది కాదన్నారు. అధి కారులు, కబ్జాకోరులు కుమ్ము క్కైనట్లు కనిపిస్తున్నదని ఆరో పించారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇరిగేషన్ భూములను గుర్తి ంచి చెరువుల యొక్క ఎఫ్‌టిఎల్ సర్వేలు చేసి ఖరీదైన ఇరిగే షన్ భూములన్నింటిని కాపాడాలని కోరారు. లేని ఎడల ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తదని హెచ్చరించారు.

ఊట్లలో బడిబాట

నవతెలంగాణ-జిన్నారం

బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సంబంధిత పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు ఉపాధ్యాయుల బృందం శుక్రవారం వివిధ కార్యక్రమాలను చేపట్టారు. జిన్నారం మండల పరిధిలోని కొర్లకుంట, మంత్రి కుంట, ఊట్ల, అండూర్, కొడకంచి ,మ ంగంపేట్, మాదారం, చెట్ల పోతారం, నల్తూర్, శివానగర్, అలీనగర్, ప్రాంతాలతో పాటు మిగతా గ్రామాల్లో బడిబాట కార్యక్రమాలను చేపట్టారు.



మాజీ కౌన్సిలర్ మోతీరామ్ 'ప్రజా సేవకుడు'

నవతెలంగాణ-జహీరాబాద్

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి.. వారి సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మాజీ కౌన్సిలర్ మోతీరామ్ 'ప్రజా సేవకుడు' అని టీఎస్ఐడీసీ మాజీ చైర్మెన్ మహమ్మద్ తన్వీర్ కొనియాడారు. మోతీరామ్ పుట్టినరోజు సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని మొహమ్మద్ తన్వీర్ ఆఫీస్‌లో కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ మంకల్ సుభాష్ , శ్రీకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు జాంగిర్, అబ్దుల్లా, రాములు నేత, అరుణ్, అక్రమ్, నవీద్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట రెడ్డి సంఘంలో వేప చెట్టుపై పిడుగు

నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో శుక్రవారం ఉరుము మెరుపులతో వర్షం కురిసింది. భయంకరమైన మెరుపులతో పిడుగు పడింది. వివరాల్లోకి వెళితే తహసిల్దార్ కార్యాలయానికి పక్కనే ఉన్న రెడ్డి సంఘంలోని వేపచెట్టు పై పిడుగు పడి వేప చెట్టు రెండుగా చీలింది. చెట్టు తోడుకలు ముక్కలు ముక్కలుగా చెల్లా చెదురైంది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని గ్రామస్తులు తెలిపారు. వర్షాకాలంలో పిడుగులు పడే ప్రమాదం ఉందని ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సుధాకర్ రెడ్డి, పంజా బాబు, మెకానిక్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మండలంలో బడిబాట కార్యక్రమం

నవతెలంగాణ-నిజాంపేట



నందిగామ నిజాంపేట గ్రామాలలో ఉపాధ్యాయులు గ్రామ కార్యదర్శి కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ బడీడు పిల్లలు బడిలోనే చేర్చాలని మధ్యలో చదువు మానేసిన పిల్లలను మళ్లీ చేర్చుకోవాలని గల్లి గల్లిలో తిరుగుతూ ఇంటింటి సర్వే చేశారు. పిల్లల పేర్లు నమోదు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీచర్ మహేందర్, కవిత, గ్రామ కార్యదర్శి నర్సింలు, కారోబార్ కొండల్ రెడ్డి, నందిగామ టీచర్ రాజయ్య, గ్రామ కార్యదర్శి హరీఫ్ హుస్సేన్, ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో ఎన్నికలు విజయవంతం

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్
- వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి పున:ప్రారంభం

నవతెలంగాణ-మెదక్

సమన్వయం, సమిష్టి కృషితో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించామని, వచ్చే సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని పున:ప్రారంభం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లుతో కలసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుండి జూన్ 6 ఎన్నికల పోలింగ్, కౌంటింగ్, ఎన్నికలకోడ్ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ, సహకారాలు భాగస్వామ్యం మరువలేనిదని పేర్కొన్నారు. ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరిని అభినందించారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ నిర్వహించడం చాలా సంతోషమన్నారు. పోలింగ్ సమయం ఉదయం 7 నుండి సాయంత్రం 6 గంటల వరకే అయినప్పటికీ ఓటర్లు పెద్ద ఎత్తున ఎండలను సైతం లెక్కచేయక ఓటు హక్కు వినియోగించుకోవడంలో చైతన్యం చాటారని, అందువల్ల గత పార్లమెంటు ఎన్నికల కంటే దాదాపు నాలుగు శాతం అధికంగా పోలింగ్ నమోదు జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన అధికారులను, అనధికారులను, జిల్లా ప్రజలను అభినందించారు.





యధావిధిగా ప్రజావాణి

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయిన ప్రజావాణి కార్యక్రమం వచ్చే సోమవారం నుంచి యధావిధిగా కొనసాగుతుందన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇకపై ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ప్రజలు నేరుగా వచ్చి తమ తమ సమస్యల్ని వినిపించవచ్చన్నారు. ప్రజల నుంచి వచ్చిన వివిధ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని మెదక్ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బట్టలను కుట్టడానికి సిద్ధం చేస్తున్న మహిళా సంఘాలు



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము విద్యార్థులకు ఏకరూప దుస్తులను జూన్ 12 వరకు పంపిణీ చేయాలని ప్రభుత్వము కృత నిశ్చయంతో ఉన్నది . అందులో భాగంగానే మండల కేంద్రంలో శుక్రవారం మహిళా సంఘాలు విద్యార్థుల యూనిఫాంలను కుట్టడానికి పనిలో నిమగ్నమైనారు. ఈ కార్యక్రమంలో డి పి ఎం లు వెంకటేశ్వర్లు, ప్రకాష్, సిసిలు స్వరూప. లక్ష్మి, తూప్రాన్, మనోరబాద్, వెల్దుర్తి, హవేలి ఘనపూర్, మెదక్, ఏపీఎంలు సీసీలు తదితరులు పాల్గొన్నారు.

పదవిలో ఉన్నప్పుడు చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

ఎంపీపీ మంజుల, జడ్పీటీసీ మేఘాల



నవతెలంగాణ-కొల్చారం

పదవిలో ఉన్నప్పుడు ప్రజా ప్రతినిధిగా ప్రజలకు అందించిన సేవలే చిరకాలికంగా గుర్తింపునిస్తాయని మండల పరిషత్ అధ్యక్షురాలు కోరబోయిన మంజుల కాశీనాథ్, జెడ్పిటిసి సభ్యురాలు మేఘమాల సంతోష్ కుమార్‌లు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకోబడిన పదవులు చేపట్టి గత కొంతకాలంగా ప్రజలకు సేవలందించడం సంతృప్తినిచ్చిందన్నారు. అలాగే సేవ చేసే భాగ్యం తమకు ప్రజలు కల్పించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ తమ నివేదికలను సభలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మి నరసింహ, డిప్యూటీ తహశీల్దార్ నాగవర్ధన్, మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు ఉదయ వేమారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ ఇర్ఫాన్, శ్రీకాంత్, ఎంపీటీసీలు భాగ్యలక్ష్మి సిద్ధిరాములు, ఆరట్ల ఎల్లయ్య, ఏపీవో మహిపాల్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంలో ఖాళీలను భర్తీ చేయాలి

- సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్ గా నియమించాలి
- ఈ నెల 10న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, సీనియర్ మేట్ల సంఘం జిల్లా కన్వీనర్ గోపాల్



నవతెలంగాణ-మెదక్

ఉపాధి హామీ పథకంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే మల్లేశం, సీనియర్ మేట్ల సంఘం జిల్లా కన్వీనర్ గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీనియర్ మేట్ల జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు, సవాళ్లు అనే అంశంపై రాష్ట్ర సదస్సు హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. జిల్లాలో ఉపాధి హామీ చట్టం అమల్లో అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కార్యాలయం నుండి సుమారు 500 పోస్టులు ఫీల్డ్ అసిస్టెంట్లు 270 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 269 మంది సీనియర్ మెట్లతో పని చేయించుకుంటూ సీనియర్ మేట్లకు కనీస వేతనం ఇవ్వకుండా కేవలం కూలి చెల్లిస్తూ పనిభారాన్ని పెంచుతున్నారన్నారు. సీనియర్ మేట్లను వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు మూడు నెలల నుండి వేతనం పెండింగ్లో ఉన్నాయన్నారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని పారా, గడ్డపార, తట్ట లాంటి పరికరాలు ఇవ్వాలని, మెడికల్ కిట్లు, టేపు, మీటర్ లాంటివి ఇవ్వాలన్నారు. ఎఫ్ఎలకు జీవో నెంబర్ 479 ప్రకారం కాకుండా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. రోజు కూలి రూ.600 చెల్లించాలని 200 రోజులు పని కల్పించాలన్నారు. ఫోటో తీసే విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఆధార్ కార్డు అనుసంధానం లేకుండానే పని కల్పించాలని ప్రతి వ్యక్తికి జాబ్ కార్డులు ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, బిక్షపతి, కవిత, నారాయణ, శ్రీకాంత్, దుర్గేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ కన్నా మెరుగైన ఫలితాలు

- తహశీల్దార్ షేక్ కరీం

నవతెలంగాణ - నార్సింగి

మండల పరిధిలోని పెద్ద తాండాలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట రెండవ రోజు కార్యక్రమాన్ని శుక్రవారం నార్సింగి తహశీల్దార్ షేక్ కరీం ఆధ్వర్యంలో నిర్వహించారు. బడి ఈడు పిల్లలు బడిలో ఉండే విధంగా 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా షేక్ కరీం తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ తో పాటు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మల్లేశం, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడి ఈడు కలిగిన పిల్లల తల్లి దండ్రుల తో కలిసి వారు మాట్లాడారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్య నేర్పే ఉపాధ్యాయులు ఉన్నతమైన చదువులు చదువుకొని ఉంటారని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన పరీక్షలలో ఉత్తీర్ణులైన, మేధావులు అయిన ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించి విద్యా బోధన చేయిస్తుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తారని అన్నారు. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారాన్నారు. పిల్లల తల్లి దండ్రులు ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని ఆలోచన చేయాలని, తమ పిల్లల బంగారు భవిత కొరకు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలు చేర్పించాలని విజ్ఞప్తి చేశారు.



రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి

-ఎంపీపీ గంగాధరి సంధ్య రవీందర్.

నవ తెలంగాణ-రాయపోల్



వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులకు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచి ఇబ్బందులు రాకుండా చూడాలని ఎంపీపీ గంగాధరి సంధ్య రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన దౌల్తాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. మండల వ్యవసాయ అధికారి గోవిందరాజు మాట్లాడుతూ జనుము 50 క్వింటాలు జీలుగు విత్తనాలు 134 క్వింటాలు ఇప్పటివరకు రైతులకు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు ఎంపీటీసీలు ఇటీవల చేసిన పనులకు బిల్లులు ఇప్పించాలని కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరగా వచ్చేలా చూస్తామని పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఐదు సంవత్సరాల పదవి కాలంలో తమకు సహకరించిన ప్రజా ప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, ఎంపీఓ సయ్యద్ గఫూర్ ఖాద్రి, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, పంచాయతి కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- రామాయంపేట ఏడిఏ వసంత సుగుణ, ఏవో హరిప్రసాద్

నవతెలంగాణ-చేగుంట



రైతులకు షాపుల యజమానులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రామయంపేట ఏడిఏ వసంత సుగుణ హెచ్చరించారు. చేగుంట మండలంలో శుక్రవారం విత్తన షాపులను ఏడీఏ వసంత సుగుణ, మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం షాపు యజమానుల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ వసంత సుగుణ మాట్లాడుతూ నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రతి డీలర్ తప్పనిసరిగా విత్తన స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్ లు, విత్తనాలకు సంభందించిన ఇన్వాయిస్లు , తప్పనిసరిగా మెయింటైన్ చేయాలని దుకాణాల యజమానులకు సూచించారు. రైతు సోదరులు కూడా విత్తనాలను అధీకృత డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, లూజు విత్తనాలను కొనుగోలు చేయరాదని, విత్తన కొనుగోలు రసీదును పంట కాలం పూర్తి అయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విత్తన డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రం అందరికీ ఆరోగ్యం

నవతెలంగాణ-అక్కన్నపేట



వానాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో, సీజనల్ వ్యాధుల పైన ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రజలకు వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా ముందుగా, వార్డులో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వారి యొక్క ఆరోగ్య క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు, అనంతరం, ఆరోగ్య కార్యక్రమాల పనితీరును మరియు రికార్డులను పరిశీలించారు, ఫార్మసీ స్టోర్ కి వెళ్లి మందుల పంపిణీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. వర్షాకాలంలో వచ్చే అంటూ వ్యాధులను కలుషితమైననీరు త్రాగడం వల్ల వచ్చే డయేరియా, రక్త విరోచనాలు, కామెర్లు, దోమల కుట్టడం ద్వారా వచ్చే మలేరియా, చికున్ గన్యా ,ఫైలేరియా, డెంగ్యూను ఎదుర్కొనేందుకు, ముందస్తు చర్యలు మందులను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ శ్రీనివాస్, వైద్యాధికారులు డాక్టర్ రమ్య ఎంఎల్ హెచ్ పీ డాక్టర్ వినీత, సి హెచ్ ఓ శబ్ద ప్రకాష్, జమీరుద్దీన్, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్న మాదాసు

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు మాదాసు అన్నపూర్ణ శ్రీనివాసు దంపతులు కుటుంబ సభ్యులతో మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కూతురు రెండవ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ అన్నపూర్ణ దంపతులు కూతురుతో మర్కుక్ మండలం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో గజ్వేల్ ఎమ్మెల్యే రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. కేసీఆర్‌కు శ్రీనివాస్ పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ మాదాసు అన్నపూర్ణ శ్రీనివాస్ కుటుంబం నిండు నూరేళ్ల జీవించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని దీవించారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి



ఇంచార్జి ఎంపీడీవో విగ్నేశ్వర్

నవతెలంగాణ-వెల్దుర్తి

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట రెండో రోజు కార్యక్రమం మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఇంచార్జి ఎంపీడీవో జగదీశ్వరచారి వెల్దుర్తి హైస్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్యతో కలిసి నిర్వహించారు. మండల పరిధి హస్తాల్పూర్ గ్రామ శివారులో గంగిరెద్దుల వాడ పిల్లలు బడికి రాకుండా పశువుల కాపరులుగా ఉండి చదువులకు దూరమవుతున్నారన్న సమాచారం మేరకు గంగిరెద్దుల వాడకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. బడి ఈడు పిల్లలు బడికి పంపండి అని అన్నారు. పశువుల కాపరులుగా ఉంటే అజ్ఞానులు అవుతారని అన్నారు. పాఠశాలకు వెళ్లి చదువుకుంటే విజ్ఞానవంతులై ఎక్కడైనా తెలివితేటలతో బ్రతకొచ్చని తగు సూచనలు చేశారు. ఈనెల 12న పాఠశాల పునః ప్రారంభోత్సవం జరుగుతుంది మీ పిల్లలంతా బడిలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. మీ పిల్లలకు ఉచిత పుస్తకాలు యూనిఫాం ఉచిత భోజనం సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మరికొంత మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు

నవతెలంగాణ-మెదక్ : మెదక్ పట్టణంలో శనివారం మధ్యాహ్నం 1 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మెదక్ ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ జావేద్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, తదితర కరెంట్ పనులు చేయనున్న నేపథ్యంలో మెదక్ పట్టణంతో పాటు కలెక్టరేట్, ఎస్పి ఆఫీసులు, ఔరంగాబాద్, అవుసులపల్లి ప్రాంతాల్లో శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం 1.00 గంటల నుంచి 5 గంటల వరకు మెదక్ పట్టణంలో కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏడీఈ, ఏఈలు పేర్కొన్నారు. ఈ విషయంలో మెదక్ పట్టణ ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

మిషన్ భగీరథపై వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం మిషన్ భగీరథ పై కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. గ్రామాలలో ప్రతి ఒక్క ఇంటికి మిషన్ భగీరథ నీరు అందించాలని నీరు రాని వారికి వచ్చే విధంగా నల్ల కనెక్షన్ లేనివారికి కనెక్షన్ ఇచ్చి అందరికీ నీరు అందే విధంగా చర్యలు చేపట్టాలనీ అధికారులకు సూచించారు. అధికారులు ఇంటింటికి తిరిగి నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎవరైతే చేర్రలు తీసివేసినారో మరల చెర్రలు ఫిట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ రాజేందర్, గ్రామపంచాయతీల కార్యదర్శులు, అరిఫ్ హుస్సేన్, నర్సింలు యాదవ లక్ష్మి, టి ఏ లు శశిరేఖ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు....

దూల్మిట్టలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-మద్దూరు



సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, మెడికల్ కళాశాల మిట్టపల్లి ఆధ్వర్యంలో దూల్మిట్ట మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజు, సురభీ హాస్పిటల్ పిఆర్వో పరుశరాములు మాట్లాడుతూ సురభి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఉచితంగా అందిస్తున్న వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఉచిత వైద్య శిబిరంలో 473 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధూల్మిట్ట సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షురాలు జాలపల్లి సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్, సురభి హాస్పిటల్ మేనేజ్మెంట్ వెంకటేశ్వరరావు, మార్కెటింగ్ ఇంచార్జ్ రాజు, మార్కెటింగ్ బృందం పాల్గొన్నారు.

రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసి కలెక్టర్

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్



సిద్దిపేట పట్టణంలోని హరిత మినర్వా హెూటల్‌లో రిటైర్డ్ సుప్రీంకోర్ట్ జడ్జి జస్టిస్ పినాక చంద్ర ఘోష్‌ను జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై జ్యుడీషియరీ ఎంక్వయిరీ చేయడంలో భాగంగా శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలకు వెళుతూ స్వల్ప కాలం విరామం కోసం హరిత మినర్వా హెూటల్‌లో పినాక చంద్రఘోష్ స్వల్ప కాలం విరామం తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఈఎన్సీ హరిరాం తదితరులు ఉన్నారు.

14న మండల సర్వ సభ్య సమావేశం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ జాప అరుణాదేవి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 14న ఉదయం 11.00 గం.లకు నిర్వహించనున్నట్లు ఇంచార్జి ఎంపీడీవో వేణుగోపాల్ తెలిపారు. నంగునూరు మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు సమయానికి హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు. సంబంధిత అధికారులు తమ శాఖలకు పూర్తి వివరాల నివేదికను ఈ నెల 12 లోగా 25 సెట్లు ఎంపీడీవో కార్యాలయంలో తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో రామ్మోహన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలు ఉదయం పూట త్వరగా వచ్చి పనులు పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే మస్టర్లో సంతకాలు ప్రతి ఒక్కరు పెట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కాజా మొయినుద్దీన్, పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన పెద్దబోయిన రాముల ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం బీసీ సెల్ మండలాధ్యక్షులు, జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. వారితో పాటు బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు పిట్ల మహేష్, నారని ఎల్లం, కొట్టాల మహేష్, తదితరులున్నారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కరపత్రం ఆవిష్కరణ



నవతెలంగాణ-నంగునూరు

జిల్లాలో పదోతరగతి ఫలితాలను ముందంజలో నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రామస్వామిగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం బడి బాట కార్యక్రమంలో భాగంగా నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 జీపీఏ సాధించిన ఆరుగురు పాఠశాల విద్యార్థుల కరపత్రం ఆవిష్కరించారు. నంగునూరు సెంటర్ స్కూల్‌లో ఐదో తరగతి పాసైన విద్యార్థుల వివరాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తహసీన్ సుల్తాన, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అందరినీ ఆరోతరగతిలో ప్రవేశం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో ఏక రూప దుస్తులు పంపిణ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం జేపీ తండా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఏక రూప దుస్తులను తాజా మాజీ సర్పంచ్ బిక్షపతి నాయక్ పంపిణీ చేశారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న 50 మంది విద్యార్థులకు గ్రామ మహిళా సమైక్య సంఘం సభ్యులు స్కూల్ డ్రెస్సులు కుట్టారు. ఆ దుస్తులను ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రామకృష్ణ మహిళా సంఘ సభ్యులు అప్పజెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చదివించాలని తల్లిదండ్రులను కోరారు. మన గ్రామ మహిళా సమైక్య సంఘం సభ్యులు చక్కగా డ్రెస్సులు కుట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సంగు రామకృష్ణ, ఐకేపీ ఏపీఎం లింగం, ఉపాధ్యాయులు చంద్రం, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వ్యకాస రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

- వ్యకాస జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట మావో
- సదస్సుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరణ

నవతెలంగాణ-చేర్యాల

గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులో ప్రభుత్వం అనేక అవకతవకలు చేస్తుందని చట్టం అమలు తీరును సరిచేయాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తుంది. రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట మావో ఉపాధి హామీ కూలీలను కోరారు. రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం చేర్యాల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని చుంచనకోట గ్రామంలోని పని ప్రదేశాలలో ఆవిష్కరించారు. అనంతరం వెంకట మావో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, రోజు వారి కూలి కనీసం రూ.100 కూడా రావడం లేదని తెలిపారు. వేసవి అలవెన్స్‌ను నిలుపు చేశారని, ఏ పని ప్రదేశంలో చేసిన పనులకు రోజు కూలి ఎంత వచ్చిందని తెలిపే పేస్లిప్పులు ఇవ్వడం లేదన్నారు. చేసిన పనులకు నెలలు గడుస్తున్నా కూలీ డబ్బులు రావడంలేదన్నారు. పనికి ఉపయోగించే పలుగు, పారా, తట్ట లాంటి పనిముట్లు ఇవ్వకపోగా పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు టెంటు, మెడికల్ కిట్టు, సరిపోను మంచినీరు చట్టం ప్రకారం కల్పించాల్సి ఉండగా, వాటిని పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ కూలీలకు చట్టంలో కల్పించాల్సిన నిబంధనలను ఏమాత్రం పాటించడం లేదని విమర్శించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకనుగుణంగా కూలిరేటు కొలతలతో నిమిత్తం లేకుండా రోజు కూలీ రూ.600లు చెల్లించాలని, ప్రతి కుటుంబానికి 200 పని దినాలకు పెంచాలని, పలుగు సాన పట్టించే చార్జీ రూ. 200 లకు పెంచాలని, పట్టణ ప్రాంత కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేసిన పనులకు డబ్బులు వారం వారం చెల్లించాలని చట్టంలో ఉన్నా దాన్ని అమలు చేయకుండా సంబంధిత అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, ఉపాధి హామీ పనులు చేస్తున్న వ్యవసాయ కూలీలను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం మధ్యాహ్నం పని ప్రదేశంలో ఫోటో సిస్టం, డ్రోన్ల పర్య వేక్షణ పద్ధతులు అవలంబించడం దారుణమన్నారు. ఈ విధానాలను వెంటనే తొలగించి ఆరు గంటల పనికి రోజు కూలీ రూ.600, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించే విధంగా, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం అమలు, కూలీల సమస్యలు అన్ని పరిష్కరించే విధంగా ఈ సదస్సు దోహద పడాలన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు శివదాసం, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సదస్సు జయప్రదం చేయడానికి అత్యధిక సంఖ్యలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ పనులు చేసే కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గొర్రె శ్రీనివాస్, అధ్యక్షులు గుండ్ర రవీందర్, చేర్యాల పట్టణ కార్యదర్శి బోయిని మల్లేశం, సూర్న తిరుపతి, పండుగ యాదగిరి, నారాయణ, శీల లక్ష్మయ్య, బాలరాజు, బాలమణి, కనకవ్వ తదితరులు పాల్గొన్నారు.



అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనులను పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి

నవతెలంగాణ-సిద్దిపట కలెక్టరేట్

అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన పనులను ఈ నెల 20వ తేదీలోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఈడబ్ల్యుఐడీసీ ఇంజనీర్లు, విద్యాశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద జిల్లాలో 814 పాఠశాలలలో విద్యుత్, తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ గోడల మరమత్తు పనులను చేపట్టడం జరిగిందన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడానికి ఇంకా 5 రోజుల సమయం మాత్రమే ఉన్నా ఇప్పటికీ 176 పాఠశాలలలో నిర్మాణ పనులు పూర్తయి మిగతా పాఠశాలలలో చేపట్టిన పనులు కాకపోవడంపై పంచాయతీరాజ్, ఈడబ్ల్యుఐడిసి ఇంజనీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. నిర్మాణం చివరి దశలో ఉన్న పాఠశాలలలో రంగులు పూర్తిచేసి 12లోగా అందించాలని తెలిపారు. పాఠశాలలో ఈ నెల 20వ తేదీలోగా 100% పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పూర్తి చేయని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు సౌకర్యవంతంగా చదువుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. రూ.32 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టగా ఇప్పటికీ రూ.8 కోట్లను చెల్లించడం జరిగిందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో పనులు చేపట్టి నిర్మాణ ప్రగతి సరిగా లేని పాఠశాలలను, అసలే పనులు ప్రారంభించని పాఠశాలలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారితో కలిసి సందర్శించి త్వరగా నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. సోమవారం అన్ని మండలాల్లో ఎంపీడీవోలు, ఎంఈఓలు, పంచాయతీ రాజ్ ఇంజనీర్లు, ఐకెపి వివోలు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈలు, డీఈలు, ఎఈలు, ఈడబ్ల్యుఐడిసి ఇఇ, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



రామకోటి రామరాజుకు ఘన సన్మానం

- 25 సంవత్సరాల కృషి పట్టుదల అమోఘం
- జగదేవపూర్ భక్త బృందం



నవతెలంగాణ-గజ్వేల్

గత 25 సంవత్సరాల నుంచి రామకోటి రామరాజు చేస్తున్న ఆధ్యాత్మిక కృషి పట్టుదల అమోగమని జగదేవపూర్ వెంకటేశ్వర దేవాలయ కమిటీ వారు శుక్రవారం నాడు శాలువ కప్పి జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతుని సేవ చేసుకోవడం అందరికీ రాదన్నారు. జగదేవపూర్ గ్రామస్తులచే భద్రాచల సీతారాముల కళ్యాణానికి గోటి తలంబ్రాలు అందజేసి, కళ్యాణం అనంతరం మళ్ళీ ముత్యాల తలంబ్రాలు తమకు అందించడం అందరికీ సాధ్యం అయ్యేపని కాదన్నారు. అలాంటి రామభక్తి సేవ చేసుకోవడం రామకోటి రామరాజుకే చెందిందన్నారు. అందుకే భద్రాచలం దేవస్థానం రామకోటి రామరాజును మరో భక్త రామదాసుగా కీర్తించి సన్మానించడం ఆయన భక్తికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో రామకోటి ప్రతినిధులు చిగుళ్లపల్లి వెంకటేశం, మరిపడిగే రాము, అయిత కేశవులు, బుద్ధ రమేష్ పాల్గొన్నారు.

పాలమూరులో డీకే అరుణ ఎలా గెలిచిందో సీఎం చెప్పాలి?

నవతెలంగాణ-గజ్వేల్



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతు లేనిది మహబూబ్‌నగర్‌లో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ఎలా విజయం సాధించారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మద్దతు లేనిది బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలిచే అవకాశమే లేదన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంటు స్థానంలో బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ విజయం కోసం సీఎం రేవంత్ రెడ్డి ఓట్లు బదిలాయించాలని కార్యకర్తలు నాయకులకు ఆదేశాలు ఇవ్వడంతోనే అక్కడ ఈటేల రాజేందర్ గెలిచినట్లు ఆయన ఆరోపించారు. మెదక్ పార్లమెంటు పరిధిలో ఓట్ల బదలాయింపులో హరీష్ రావు హస్తముందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించడం సిగ్గుచేటన్నారు. గజ్వేల్ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసినందుకు గజ్వేల్ అభివృద్ధికి గజ్వేల్ ఆత్మ గౌరవానికి ఓటు వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు సీఎం రేవంత్ రెడ్డి మెదక్‌లో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు గెలుపు కొరకు హరీష్ రావు కారణమని చేసిన వ్యాఖ్యలను వంటేరు ప్రతాప్ రెడ్డి తీవ్రంగా ఖండించారు ఆలోచించకుండా అనాలోచితంగా ఒక బాధ్యతాయుతమైన హెూదాలో ఉండి అర్థరహితమైన మాటలను మాట్లాడడం రేవంత్ రెడ్డి మానుకోవాలని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రం కోసమే పుట్టిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అన్నారు, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చేసేది సంక్షేమంలో అవినీతి లేకుండా పథకాలను అందించేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనన్నారు. మల్లన్న సాగర్ కొండ పోచమ్మ సాగర్‌లలో నీటిని నింపి రైతులకు ప్రజలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పైన ప్రజల వచ్చిన ఆపదల పైన ఎప్పటికప్పుడు ప్రజలతో మమేకమై ప్రజా గొంతుకై ప్రజల వెంటే ఉంటామన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతామన్నారు. నియోజకవర్గంలోని మల్లన్న సాగర్ కొండపోచమ్మ సాగర్ పెండింగ్‌లో ఉన్న కెనాల్స్ వర్క్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు, అలాగే గజ్వేల్ నియోజకవర్గంలో రూ.170 కోట్ల నిధులను గత ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని వెనక్కి తీసుకొని గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిని అడ్డుకుంటుందని మండిపడ్డారు. వెంటనే రూ.170 కోట్ల నిధులను మంజూరు చేసి గజ్వేల్ నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులతో అడుగడుగునా కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటామన్నారు.

యోగ సాధన వల్ల ఏకాగ్రత పెరుగుతుంది

- ఎక్కడ ఆరోగ్యం ఉంటుందో అక్కడ విద్య వికసిస్తుంది
- మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

యోగ సాధన వల్ల ఏకాగ్రత పెరుగుతుందని, ఎక్కడ ఆరోగ్యం ఉంటుందో అక్కడ విద్య వికసిస్తుందని చేర్యాల మండల విద్యా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గత మే 1 నుంచి నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బాల్యంలో యోగ సాధన పిల్లల మానసిక, శారీరక వికాసానికి దోహదం చేస్తుందన్నారు. యోగ సాధన వల్ల ఏకాగ్రత పెరుగుతుందని అది విద్యార్థుల సర్వతోముఖ వికాసానికి దారితీస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభుత్వం యోగ విద్యలో ప్రతిభ కనబరిచిన వారికి విద్య అడ్మిషన్లలో, ఉద్యోగాల్లో కల్పిస్తున్న రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవచ్చు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్ మాట్లాడుతూ ఆసుపత్రులకు దూరంగా ఆనందానికి దగ్గరగా ఉండాలనుకునేవారు యోగను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగాలో అద్భుత ప్రతిభ కనబరచుడమే గురువులకు ఉత్తమ దక్షిణ సమర్పణ అని తెలిపారు. సిద్దిపేట జిల్లా ఎస్టిటి టీచర్స్ సంఘం అధ్యక్షులు శ్రీరామ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మారుతున్న సంస్కృతి వల్ల పిల్లలు శక్తి హీనులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ టీవీ,సెల్ ఫోన్, అవాంఛనీయ ఆహారాల వల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. రాష్ట్ర యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి తోట సతీష్ మాట్లాడుతూ విశిష్టమైన యోగ పిల్లల పటిష్ట భవిష్యత్తుకు దోహదం చేస్తుందన్నారు. వేసవి సెలవుల్లో నిర్వహించిన ఉచిత యోగ శిక్షణ శిబిరానికి చక్కటి స్పందన లభించడం పట్ల ఉచిత శిబిర సారధి రాష్ట్ర యోగ న్యాయమూర్తి బునాద్రి కిషన్ ఆనందం వ్యక్తం చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లను బహుకరించారు.



వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఎంపీపీ లావణ్య



నవతెలంగాణ-ములుగు

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ లావణ్య అంజన్న గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీపీ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లావణ్య మాట్లాడుతూ వర్షాకాలం సమీపించింది కనుక గ్రామాలలో పారిశుధ్య పనులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఇప్పటికే గ్రామాలలో నీటి కొరత ఉన్నట్టుగా తెలుస్తుందని ప్రజలకు త్రాగునీరు అందించడం కోసం అధికారులు కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ పంచాయతీ కార్యదర్శిలు మురికి కాలువల శుభ్రం చేయించడంతోపాటు వాటర్ ట్యాంక్ శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టాలన్నారు. ప్రభుత్వం రైతులకు సకాలంలో విత్తనాలు ఎరువులు అందించడం కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఇప్పటికే కొన్ని జిల్లాలలో విత్తనాల కొరత ఉన్నట్టుగా రైతులు ధర్నాలు చేసిన సంఘటనలు చూసామని మండలంలో అలాంటిది పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, పి ఏ సి ఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి, జిల్లా కో ఆప్షన్ మెంబర్ సలీం , ఎంపీడీవో శర్మ. ఎంపీటీసీలు లింగారెడ్డి, మధుసూదన్ రెడ్డి, హరిబాబు, పోచమ్మ, మమత, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ మండల కేంద్రంలో గల మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి బాలేశం గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశం చివరిది కావడంతో ఎంపిటిసిలు తమ తమ అభిప్రాయాలను తెలిపారు. సుమారు గత 5 సంవత్సరాలుగా సహకరించిన అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎంపిపి బాలేశం గౌడ్ ఎంపిటిసిలందరికి తమ తోడ్పాటు అందించారని తెలిపారు. ఇప్పటి వరకు ప్రజలకు సేవ చేసే అవకాశం కలగడం అదృష్టమన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం సహకారంతో అవకాశం వస్తే మళ్లి నూతన సర్వసభ్య సమావేశంకు వస్తామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆయాశాఖల అధికారులతో ప్రజల సమస్యలపై చర్చించారు. వచ్చే వర్షాకాలంలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గతంలో లాగానే ప్రజల అవసరాలపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, పిఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి, ఎంపిటిసిలు కిరణ్ గౌడ్, కవిత శ్రీనివాస్ రెడ్డి, రమ్యరవి, కావ్యాదర్గయ్య, మహేందర్ రెడ్డి, స్రవంతిశివకుమార్, మంజుల మహేందర్ రెడ్డి, మహేష్ యాదవ్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, నిపుణులైన ఉపాధ్యాయులు బోధిసారని, ఇంగ్లీష్ మాధ్యమంలో విద్య లభిస్తుందని టీ.పి.టీ.ఎఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు జి.తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ నూతనన్నోన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి హనుమాన్ నగర్, గుండ్లచెరువులలో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. తమ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కు, ఉచిత యూనిఫాంలు, పౌష్టిక ఆహారం, ఎన్‌సిసి, క్రీడలు అందుబాటులో ఉంటాయన్నారు. మీ పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీతా దేవి, వెంకటరమణ, రవీందర్ రెడ్డి, దుర్గయ్య, శ్రీదేవి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పద్మ, తిర్మల్ రెడ్డి, లలిత, మల్లేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గ ప్రమాణ స్వీకార కరపత్రం ఆవిష్కరణ



నవతెలంగాణ-సిద్దిపేట: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా యువజన అధ్యక్షులు ఎస్ సీ సంతోష్ అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ నాయకులతో కలసి ఎస్‌సీ సంతోష్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా విభాగం, మహిళా విభాగం యువజన విభాగం, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం గజ్వేల్ వైష్ణవి గార్డెన్స్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్యులు సకుటుంబ, సపరివార సమేతంగా హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నంగునూరి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట బిక్షపతి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నేతి శ్రీనివాస్, సీనియర్ నాయకుడు సంజయ్ గుప్త, గజ్వేల్ పట్టణ ఐవిఎఫ్ అధ్యక్షుడు కైలాస ప్రభాకర్, యువజన అధ్యక్షుడు కొమరవెల్లి శ్రవణ్ కుమార్, నాయకులు దొంతుల సత్యనారాయణ, అమర నాగేందర్, కొముర‌వెల్లి ప్రవీణ్, బ్రాహ్మండ్ల పల్లి బిక్షపతి, ఉత్తునూరి సంపత్, బాలేష్ పాల్గొన్నారు.

మృగశిర స్వాంతన..!

- గ్రీష్మ తాపంతో అల్లాడిన జనానికి ఊరట
- రుతుపవనాలను ఆహ్వానించడం మృగశిరకార్తె ప్రత్యేకత
- దుక్కులు దున్నుకునేందుకు రైతులకు అనువైన కాలం
- కార్తె ప్రారంభంలో చేపల సందడి.





నవతెలంగాణ-పెద్దశంకరంపేట/ నంగునూరు

మృగశిర కార్తె అనగానే అందరికి ప్రాణం లేచొస్తుంది.! గ్రీష్మ తాపంతో అల్లాడిన ప్రతి ఒక్కరికీ కాస్త స్వాంతన కలుగుతుంది. సృష్టిలోని జీవకోటి కూడా ఆనంద పరవశంలో తేలియాడుతుంది. మృగశిర కార్తెలో ముళ్ళు మెత్తబడుతుంటాయి. పెద్దలు ఎంతో అనుభవంతో చెప్పిన ఈ మాట నూటికి నూటయాభై పాళ్ళ నిజమని తాజా వాతావరణాన్ని చూస్తే అందరికి స్పష్టమవుతోంది. రోహిణి కార్తెలో రోళ్ళ పగిలే ఎండలు కాస్తాయి. మృగశిర ప్రవేశించగానే ఒక్కసారిగా వాతావరణం చల్లబడుతుంది.



రైతులు దుక్కులు దున్ని పంటలు వేసేందుకు, నాగళ్లతో కదం తొక్కే సమయం ఇదే "ఏరువాక సాగరో రన్నో రైతన్న " నీ కష్టమంతా తీరునురో రన్నో చిన్నాన్న " అంటూ ఓ సినీ కవి రాసిన పాటకు పూర్తి స్థాయి అర్థం చేకూర్చే కార్తె ఇదే. అప్పటి వరకు నెర్రెలుపాసిన నేల తల్లి చిరు జల్లులతో పులకించిపోతుంది. ఆ చినుకు తాకిడికి ముక్కు పుటని తాకిన మట్టివాసనతో కర్షకులు ఉత్సాహం పొందుతారు.ఆరుగాలం కష్టించేందుకు సరైన సమయం ఆసన్నమైందనట్టు సమయత్తమవుతారు.

వడగాలులతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు చిరుజల్లులతో ఒక్కసారిగా ఊరట చెందుతారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుంటాయి. గాలిలో తేమ శాతం అనూహ్యంగా పెరిగిపోతుంది. అందుకే మృగశిర కార్తె మొదట్లో చేపలకూర తింటే మంచి జరుగుతుందని భావిస్తారు. ఏడదంతా వ్యాధుల బారిన పడకుండా ఉంటారని నమ్ముతారు. మిగతా రోజుల్లో ఎలా కొనుగోలు చేసినా.. మృగశిర కార్తె మొదటిరోజు చేపలను కొనుగోలు చేసేందుకు తెగ ఆరాటపడిపోతుంటారు. దీన్ని ఆసరా చేసుకొని వ్యాపారులు మృగశిర కార్తె రోజు చేప మందు పంపిణీ చేస్తారు. వ్యాపారులు ధరలను ఆకాశానికెత్తి విక్రయాలు సాగిస్తారు. ఏది ఏమైనా మృగశిర కార్తె ప్రవేశించిన ఈ రోజు (శనివారం) నుంచి ఏడాదంతా మంచి వర్షాలతో రైతన్నకు మంచి ఫలితం సిద్ధించాలని ఆకాంక్షిదాం.

భారీగా చేపల విక్రయాలు

మృగశిర కార్తె రోజున చేపలు తింటే ఆరోగ్యం బాగుపడుతుందనే డిమాండ్‌ను ఆధారం చేసుకుని వ్యాపారులు పెద్దఎత్తున చేపలను దిగుమతి చేస్తారు. సిద్దిపేట చేపల మార్కెట్‌కు ఒకరోజు ముందే గురువారం చేపలు పెద్ద ఎత్తున దిగుమతి అయ్యాయి. సాధారణ రోజుల్లో మార్కెట్ లో 2 టన్నుల నుంచి 5 టన్నుల చేపల విక్రయాలు జరుగుతాయి. మృగశిర కార్తె సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 5 టన్నుల నుంచి 7 టన్నుల చేపలు దిగుమతి అవుతాయని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో చేపల ఉత్పత్తి అధికం కావడంతో వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలతో పాటు ఏపీలోని కైకలూరు, తెనాలి, ఆకువీడు ప్రాంతాల నుంచి చేపలను దిగుమతి చేసుకున్నట్టు చేపల వ్యాపారులు తెలిపారు.

సాధారణంగా బొచ్చ, రవ్వ కిలో రూ.100 నుంచి 120కి విక్రయించారు. చిన్నసైజు చేపలు కిలో 100 రూపాయల చొప్పున విక్రయించారు. మృగశిర సందర్భంగా వీటి ధరలు భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు తెలిపారు. కొర్రమీను చేపలు కిలో రూ. 400 నుంచి 450కి విక్రయించగా మృగశిర రోజున వీటి ధరలు అధికమవుతాయని అన్నారు. ఈ సారి యాసంగి సీజన్ లో వర్షాభావ ప్రభావంతో చెరువుల్లో వేసిన చేపల నీళ్ళ లేక వెలవెల బోయాయి. గత సంవత్సర ఇదే నెలలో చెరువుల పండుగ పేరుతో ఊరూరా సంబరాలు జరిగాయి. ఈ సారి యాసంగి సీజన్ లో వర్షాభావ ప్రభావంతో చెరువుల్లో నీరు లేక, పంటలకు నీరు అందక చాలా ఎండిపోయాయి. నీరు పుష్కలంగా ఉంటే పెద్ద వాగు పరిసర ప్రాంతాల్లో చేపలు పుష్కలంగా దొరికేవి. ఈ సారి చేపల రేట్లు రెండింతలు అయ్యాయని జనం ఆవేదన చెందుతున్నారు.

25 సంవత్సరాలుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న శ్రీవాణి పాఠశాల

- విద్యార్థుల సర్వతాముకాభివృద్ధి పాఠశాల లక్ష్యం
- పదవ తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలో 25 సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ, విద్యార్థుల సర్వతాముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక విద్యాసంస్థ శ్రీవాణి పాఠశాల (భారత్ నగర్). గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు విద్యతో పాటు, మానవ విలువలను, నీతిని నేర్పిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న విద్యాసంస్థ. గత 25 సంవత్సరాలుగా పాఠశాల యాజమాన్యం మారకుండా, ప్రతి ఒక్క విద్యార్థి తల్లిదండ్రులతో సత్సంబంధాలను ఏర్పాటు చేసుకొని, ప్రతి విద్యార్థి పైన ప్రత్యేకమైన శ్రద్ధతో పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. ప్రతి సంవత్సరం వెలువడే పదవ తరగతి ఫలితాలలో 10 జీపీఏ పాయింట్లు సాధిస్తూ, క్రీడలు, సైన్స్ ఫెయిర్, ప్రభుత్వం నిర్వహించే ఇతర కార్యక్రమాలలో శ్రీవాణి విద్యార్థులు పాల్గొంటూ తమ సత్తాను చాటుతున్నారు.

ప్రత్యేకమైన విద్య బోధన

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలని బోధిస్తూ, వాటికి అనుగుణంగా నేటి పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా వివిధ అంశాలపై విద్యా బోధన జరుగుతున్నది. నర్సరీ నుంచి పదవ తరగతి వరకు విద్యా బోధన జరుగుతున్నది. ఎస్‌పిఎల్, ఎన్‌పిఎల్, సిపిఎం, యుపిఎల్ బ్యాచ్‌లను ఏర్పాటుచేసి విద్యార్థుల, వారి తల్లిదండ్రుల కోరిక మేరకు ఐఐటి, నీట్, సీబీఎస్‌సి సిలబస్‌ను కూడా అదనంగా బోధిస్తున్నారు. శిక్షణ పొందిన అర్హత గల ఉపాధ్యాయులతో విద్యా బోధన చేస్తున్నారు. విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలపడానికి కృషి చేసే ఉపాధ్యాయులను మాత్రమే నియమించుకొని తరగతులు నిర్వహిస్తున్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకమైన తరగతులను బోధిస్తూ, వారికి ప్రత్యేకమైన శిక్షణ ఇస్తూ, పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా విద్యార్థులను తయారు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం బస్సు సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశారు.

విద్యతో పాటు ఇతర అంశాలపై శిక్షణ

భారత్ నగర్‌లోని శ్రీవాణి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తరగతి గదిలో పాఠాలతో పాటు, తరగతి బయట కూడా ఆటలు, ఇతర అంశాలపైన శిక్షణ ఇస్తున్నారు. యోగ, క్లాసికల్ డాన్స్, కరాటే అంశాలపై శిక్షణ, సైన్స్ ఫెయిర్, ఫేర్వెల్ డేస్, భారతీయ పండుగలు, సంస్కృతి, సాంప్రదాయాలు వాటిపైన అవగాహన కల్పిస్తున్నారు. లాభాపక్ష లేని యాజమాన్యం, విద్యార్థుల అభివృద్ధి తమ అభివృద్ధిగా భావిస్తున్నది శ్రీవాణి విద్యా సంస్థ.

అక్రమ వెంచర్లను తొలగించాలి

- సాదా సీదాగా కొండపాక మండల సర్వసభ్య సమావేశం
- అధికారులు అలసత్వం వీడి ప్రజలకు నిస్వార్థ సేవ చేయాలి
- కొండపాక ఎంపీపీ మంచాల అనసూయ కనకరాములు



నవతెలంగాణ-కొండపాక

మండల పరిధిలోని దుద్దెడ, కొండపాక, రవీంద్ర నగర్, వెలికట్ట తదితర గ్రామాల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లను తొలగించాలని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు చింతల సాయిబాబా డిమాండ్ చేశారు. శుక్రవారం మండల సమీకృత కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపీపీ అధ్యక్షురాలు మంచాల అనసూయ కనకరాములు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు అలసత్వం వీడి ప్రజాప్రతినిధుల సమన్వయంతో పనిచేసి కొండపాక మండలాన్ని అభివృద్ధికి ఆదర్శంగా నిలపాలన్నారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు వారివారి నివేదికలను సర్వ సభ్యుల ముందు నివేదికన సమర్పించారు సమావేశంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చింతల సాయిబాబా మాట్లాడుతూ ఐటిసి బిల్డింగ్ నిర్మాణంలో కాంట్రాక్టర్ అధికారులతో కుమ్మక్కై, అవకతవకలకు పాల్పడ్డట్టు ఆరోపించారు. సర్వసభ్య సమావేశంకు ఎన్నడు అన్ని శాఖల అధికారులు పూర్తిగా హాజరు కావడం లేదని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో పలు సమస్యలు పేర్కొనిపోయి ఉన్నాయని, ఆ సమస్యలు పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసిల్దార్ దిలీప్ నాయక్, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని, పంచాయతీరాజ్ ఏఈ తిరుపతిరెడ్డి విద్యుత్ శాఖ ఏఈ సత్యం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భూపతి, ఎంపిటిసిలు ఆరుట్ల లక్ష్మి, గురజాడ బాలాజీ, పిల్లి శిరీష, పత్తి ఆంజనేయులు, నందాల శ్రీనివాస్, పెద్ద సాయిగారి యాదగిరి, హరిత, కో-ఆప్షన్ మెంబర్ అజీముద్దీన్, వివిధ శాఖల అధికారులు పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల బడిబాట



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని 6వ నెంబర్ ఉర్దూ మీడియం పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం బడి బాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిద్దిపేటలోని వార్డు నెం.20, 21లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్‌ల కోసం సిద్దిపేటలోని అన్ని ఉర్దూ మీడియం మదర్సాల అధికారులతో ఇంటింటికి సామూహిక అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. పిల్లల అడ్మిషన్లు, విద్య యొక్క ప్రాముఖ్యత, ప్రయోజనం గురించి వివరించారు. ప్రభుత్వ ప్రాథమిక అధ్యాపకులు మాట్లాడుతూ పిల్లల ప్రాథమిక విద్య మాతృభాషలో ఉండాలని, తెలంగాణ అమలులో ఉన్న పథకాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నాసిర్ పురా ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు ఫయాజ్ అహ్మద్, సయ్యద్ వహీదుద్దీన్, లింగం, అర్షియా సిరాజ్, ఉర్దూ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గాంధీనగర్ ఉర్దూ మీడియం అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, ప్రభుత్వ ప్రాథమిక 2 పాఠశాల నెం.2 నసీర్‌పురా మదర్సా అధ్యక్షుడు సయ్యద్ రషీదుల్లా, హుస్సేన్ మహమ్మద్, అయాబ్ అహ్మద్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల షేర్పురా మదర్సా అధ్యక్షురాలు సుగ్రా సుల్తానా, సాజిద్, శ్రీమతి, భాగ్య లక్ష్మి, హుజా, చైర్‌పర్సన్ ఘౌసియా బేగం సాహిబాతో తదితరులు పాల్గొన్నారు.

వికాస్ పాఠశాలలో వికసిస్తున్న విద్యా కుసుమాలు

- మానవీయ విలువలకు పాఠ్య అంశాలకు ప్రాముఖ్యత
- పదవ తరగతి ఫలితాలలో పట్టణంలోనే టాప్



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణ శివారులోని పొన్నాల వద్ద సువిశాలమైన వాతావరణంలో, విద్యార్థులకు పాఠాలను బోధిస్తూ వారి ఎదుగుదలకు కృషి చేస్తున్న విద్యాసంస్థ వికాస్ ఉన్నత పాఠశాల. మానవీయ విలువలను విద్యార్థులకు నేర్పిస్తూ, పుస్తకాలలో ఉన్న పాఠ్యాంశాలను బోధిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న విద్యా సంస్థ. నేటి ప్రపంచానికి అనుగుణంగా ప్రత్యేకమైన పాఠ్యాంశాలను తయారు చేయించి బోధిస్తున్నారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేకమైన తరగతులు నిర్వహిస్తూ, పది ఫలితాలలో సిద్దిపేట పట్టణంలోనే మొదటి స్థానంలో నిలిచిన విద్యా సంస్థ.

క్రీడలు... విద్యకి ప్రాముఖ్యత

ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యాంశాలను బోధిస్తూ, తరగతులకు ప్రాముఖ్యతను ఇస్తున్నారు. ప్రొజెక్టర్ ద్వారా కొన్ని ముఖ్యమైన పాఠాలు బోధిస్తున్నారు. త్వరలోనే సిబిఎస్ఈ గుర్తింపు కూడా రానున్నది. క్రీడల్లో కూడా విద్యార్థులకు శిక్షణ ఇస్తూ వివిధ రకాల పోటీలలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చూపి, బహుమతులు గెలిచే విధంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం బస్సు సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధను తీసుకొని విద్యాబోధన చేస్తున్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకమైన ప్రణాళికలను రూపొందించి తరగతులు బోధిస్తున్నారు. పది పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా విద్యార్థులను తయారుచేసి, సిద్దిపేట పట్టణంలోనే 10 ఫలితాలలో 10 జీపీఏ స్థానాలను ఎక్కువగా సాధించిన విద్యాసంస్థగా నిలబడింది. సొంత భవనంలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నారు. విద్యా రంగంలో సేవ చేయాలనే దృక్పథంతో ఉన్న యాజమాన్యం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులు గల అధ్యాపకులతోనే నర్సరీ నుంచి పదవ తరగతి వరకు బోధన చేయిస్తున్నారు. విద్యార్థుల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న విద్యాసంస్థ.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధన





నవతెలంగాణ-రాయపోల్

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందిస్తుందని వడ్డేపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య అన్నారు. శుక్రవారం మండలం వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు ఏకరూప దుస్తులను ప్రభుత్వమే అందిస్తుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయబడుతుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలో కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణు, ఉపాధ్యాయులు సుధాకరరెడ్డి, సుధాకర్, మధుసూదన్ రెడ్డి, వరప్రసాద్, శ్రీనివాస్, విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగుకు రైతులు ముందుకు రావాలి



నవతెలంగాణ-మర్కుక్

అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం వలన దిగుబడులు గణనీయంగా వస్తాయని మండల వ్యవసాయ ఆధికారి టి. నాగేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ పద్ధతిలోని వంగడాలు పంట కాలం తక్కువగా ఉండటం వల్ల కాయలు, పూత తొందరగా 20 నుంచి 30 వరకు వస్తున్నాయన్నారు.. మొక్కలు ఏపుగా పెరగకుండా మేపిక్వాట్ క్లోరైడ్ అనే మందును పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ పద్ధతి సాగు చేస్తున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎకరాకు 25-30 కేజీల యూరియా 15 కిలోల పోటాష్ ఎరువులను వేసుకోవాలని సూచించారు. సాధారణంగా హైబ్రిడ్ వంగడాలను రైతులు ఎకరానికి 4938 మొక్కల నుంచి 7407 మొక్కల సంఖ్య ఉండటం వలన మొక్కలు బాగా పెరగడం, పంటకాలం పెరగడం, తద్వారా గులాబి రంగు పురుగు ఉధృతి ఎక్కువ కావడం వలన ఆశించిన మేరకు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విష్ణు వర్ధన్, రజినీకాంత్ రైతులు రాశి ప్రతినిధి మనోజ్ తదితరులున్నారు.